క్లుప్తంగా

రాత్రి సమయంలో పారిశుద్ధ్య పనులు

మంగళగిరి: నగర పాలక సంస్థ పారిశుద్ధ్య పనులు రాత్రి సమయంలో చేపట్టింది. గతంలో భిన్నంగా చెత్త శుభ్రం చేసేందుకు రాత్రిళ్లు సిబ్బందిని కేటాయించారు. నగరంలో మంగళగిరి, తాడేపల్లి పట్టణాలతో పాటు విలీన గ్రామాలలో 550కు పైగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా రాత్రి వేళల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు మంగళగిరిలో 50 మంది కార్మికులను తాడేపల్లిలో 30 మంది కార్మికులను కొత్తగా తీసుకున్నారు. వీరితో ప్రతి రోజు మంగళగిరి , తాడేపల్లిలలో రాత్రి 9 గంటల నుంచి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. నగర కమిషనర్ యు శారదాదేవి మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగపరచి నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా పారిశుద్ధ్య పనులు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చేపట్టామని తెలిపారు.

గురుకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

తాడికొండ: గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 5,6,8 తరగతులలో మిగిలిన ఖాళీల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.బాలశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రవేశ మే 20వ తేదీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

గంజాయి బస్తా మాయంపై ఆరా

మంగళగిరి: రూరల్ స్టేషన్‌లో గంజాయి బస్తా మాయం సోమవారం జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీశారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక అందజేయాలని కోరినట్లు సమాచారం . దీంతో రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులు స్టేషన్‌లోని రికార్డుల్లో నమోదైన గంజాయి బస్తా వివరాలు, స్టేషన్‌లో ఉన్న గంజాయి బస్తా నిల్వలను సరి చూసుకున్నారు. దీంతో పాటు సీసీ కెమెరాల్లో ఫుటేజ్ పరిశీలించి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

ముగిసిన జాతీయ స్థాయి సాంస్కృతిక కళా ఉత్సవం



మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంస్కృతిక కళా ఉత్సవం(కల్చరల్ ఫెస్ట్) సోమవారం సాయంత్రం ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం రాత్రి ప్రఖ్యాత పాప్ సింగర్, అర్మాన్ మాలిక్ స్టేజి షో హోరెత్తించింది. తెలుగు, హిందీ భాషల్లో ఆయన పాడిన సినీ గేయాలు విద్యార్థులను ఉర్రూత లూగించాయి. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా బహుమతులు అందజేశారు.

తాడేపల్లిలో ట్రాఫిక్ దారి మళ్లింపు

తాడేపల్లి రూరల్: పట్టణ ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు కార్పొరేషన్ అధికారులు సోమవారం పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా తాడేపల్లి ఒకటో వార్డు నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు రోడ్డు మార్జిన్‌లో తవ్వకాలు నిర్వహించారు. దీంతో భారీ వాహనాల రాకపోకలను దారి మళ్లించినట్లు ఏఈ కిషోర్ తెలిపారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతానికి భారీ వాహనాలలో వచ్చేవారు ముగ్గురోడ్డు మీదుగా రావాలని మరో 5 రోజులు ఈ పనులు జరుగుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామ వలంటీర్ ఎంపిక కోసం అర్హులైన వారు ఈనెల 25లోగా దరఖాస్తు జేయాలని ఎంపీడీఓ డి.అనూరాధ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 18ఏళ్లు నిండి అదే గ్రామ పంచాయతీకి చెందినవారై , ఆధార్, కుల, విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. 26న దరఖాస్తులు పరిశీలించి 28న మౌఖిక పరీక్ష నిర్వహించి, 29న ఎంపికైన వారి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

కనీస మద్దతు ధర ప్రకటించాలి

తెనాలిఅర్బన్: పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి మార్కెట్ యార్డు ద్వారా వాటిని కొనుగోలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ది తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు వినతిపత్రం అందజేశారు. మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి



మంగళగిరిలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు రాజనారాయణ

వైఎస్సార్‌సీపీ నాయకులు కత్తెర సురేష్ కుమార్, బత్తుల

తాడికొండ: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. కోటి గృహాల సందర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా తాడికొండ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విశేష జనాదరణ లభిస్తుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేక ఎల్లో మీడియాతో కలసి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమైందని చెప్పారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు పేదల కోసం చేసిన ఒక్క మంచి పని ఏదైనా ఉందేమో చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రంలో ఏ గ్రామ సచివాలయాన్ని అయినా సందర్శించి అర్హత ఉన్న పేదవాడికి సంక్షేమం అందడం లేదని నిరూపించాలని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీకి 175/175 సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ పోస్టరును ఆవిష్కరించారు. సమావేశంలో సర్పంచి తోకల సరోజినీ, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, మున్నంగి సుధాకర్ రెడ్డి, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మహిళా కార్యదర్శి షేక్ నగీనా, తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి తోకల నరసింహారావు, ఎస్సీ నాయకులు శృంగారపాటి సందీప్, మార్పుల శివరామిరెడ్డి, షేక్ అబ్బాస్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌పై దుష్ప్రచారం..

మంగళగిరి: జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన లభిస్తోందని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలకు కార్యక్రమం చేరువైన సందర్భంగా నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్షా 19వేల నివాసలుండగా ఇప్పటికే 57వేల 320 కుటుంబాలకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంతో ప్రతి కుటుంబానికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. రానున్న ఐదు రోజులలో నియోజకవర్గంలో పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైస్‌చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత మాట్లాడారు.

నగరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలోని ఆయా వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగుతోంది. వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. సోమవారం నగరంలోని 21వ వార్డు 12వ సచివాలయం పరిధిలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని పలు వార్డులతో పాటు నిడమర్రు, కాజ, ఆత్మకూరు, చినకాకాని, నవులూరు, యర్రబాలెం, పెదవడ్లపూడి తదితర ప్రాంతాల్లో నిర్వహించారు.

పెనుమాకలో..

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ దామేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు బొక్కా నాని, కన్వీనర్లు, గృహసారథులు సుభాని, బషీర్, రాజు, భువనం రవీంద్రరెడ్డి, నెమలికంటి ద్రాక్ష, వంశీ శరత్ పాల్గొన్నారు.

బీజేపీని రాష్ట్రంలో ముగ్గురు మోస్తున్నారు

సీపీఎం, సీపీఐ నాయకులు బీవీ రాఘవులు, కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మంగళగిరి: బీజేపీని దేశంలో ఏ రాజకీయ పార్టీ మోయడం లేదని, రాష్ట్రంలో మాత్రం ముగ్గురు మోస్తున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్‌లో సోమవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను నిరసిస్తూ ప్రచార భేరీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీని దేశంలో అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ అంట కాగడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ, టీడీపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ, దూషించుకుంటూ ఢిల్లీలో మాత్రం కౌగిలించుకుంటున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రతిపక్షాలు లేకుండా చేసే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, చిన్ని తిరుపతయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయరహదారిపై సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నానికి చెందిన తాడిబోయిన వెంకట నవీన్(25) మంగళగిరి రూరల్ పరిధిలోని నిడమర్రు గ్రామంలో నివాసముంటున్న తన తాతయ్యను చూసేందుకు ఇబ్రహీంపట్నం నుంచి ద్విచక్రవాహనంపై నిడమర్రు వెళుతున్నాడు. తాడేపల్లి సాయిబాబా గుడివద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందాడు. ఇబ్రహీంపట్నంకు చెందిన వెంకట నవీన్ తండ్రి 6 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి వరలక్ష్మితో కలసి ఉంటున్నాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వెంకట నవీన్ ఒక్కడే కుమారుడు కావడంతో తల్లి వరలక్ష్మి అస్వస్థతకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బంధువులు చేర్పించారు. నవీన్ మృతికి కారణమైన వాహనం ఆటోగా గుర్తించామని, ఆటో ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల అభివృద్ధే నిజమైన అభివృద్ధి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎస్సీ నాయకుల సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆచరణలో పెట్టి చూపిస్తున్నారని అన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నాకు అవకాశం ఇచ్చారని, ఆయన నామీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా ముక్కామల



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచి

తాడికొండ: ఉత్తమ గ్రామ పంచాయతీగా తాడికొండ మండలం ముక్కామల గ్రామం ఎంపికైంది. సుపరిపాలన విభాగంలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో సోమవారం కలెక్టరేట్ కాంపౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి నుంచి గ్రామ సర్పంచి చిమటా వెంకటేశ్వర్లు అవార్డు అందుకున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ షహేలానర్గీస్

ఫిరంగిపురం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి ఎంతో పాటుపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎంపీడీఓ డి.అనూరాధ, ఈఓపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమని సర్పంచి శ్రీవాణి ఉజ్వల హరిణి, సభ్యులను సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

8 పంచాయతీలకు అవార్డులు



మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులు అందుకున్న వివిధ గ్రామాల సర్పంచులు

మేడికొండూరు: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. వివిధ అంశలపై కృషి చేసిన మండలంలోని డోకిపర్రు, భీమినేనివారిపాలెం, జంగంగుంట్ల పాలెం, మేడికొండూరు, పాలడుగు, పేరేచర్ల, శిరిపురం, వరగాని, గ్రామపంచాయతీలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శోభారాణి, ఈఓపీఆర్డీ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో మేలు

ఫిరంగిపురం: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని 113 తాళ్లూరు రోడ్డులో ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించారు. ఈసీ భాకర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలోని పలు గ్రామాల్లో 3,61,377 పనిదినాలకు గాను రూ.9,82,94544 ఖర్చుకు అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మేడాబాబు, కె.చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామంలో సర్పంచి పి.నాగమల్లేశ్వరి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పి.వెంకట్రామిరెడ్డి, బ్రహ్మారెడ్డి, వీరారెడ్డి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు. రేపూడిలో గ్రామశివారులో పనులకు రాష్ట్ర చిన్నపరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టా అంజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి సీహెచ్ అంజనీదేవి, ఈసీ ప్రభాకర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెత్త దగ్ధం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో సోమవారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు ఒకదానికి ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అయింది. ఉండవల్లి చిన్న ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఉన్న ఆర్కే టవర్స్ పక్కన ఏర్పాటు చేసిన చెత్తకుండీలలో భారీగా చెత్త ఉండడం, అది బాగా ఎండిపోయి ఉండడంతో విద్యుత్‌వైర్ల నుంచి నిప్పులు రాలి చెత్తపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదరంతో పాటు కార్పొరేషన్ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో చెత్త కాలిపోవడంతో స్థానికంగా ఉన్న మంగళగిరి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయడంతో ఆర్కే టవర్స్‌లో నివాసముంటున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

రిక్షాలు అందజేత

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో ఇద్దరికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఫ్లాట్ ఫారం రిక్షాలు అందజేశారు. నాగశంకర్ సిమెంటు షాపులో పని చేస్తూ మెటీరియల్‌ను ఫ్లాట్ ఫారం రిక్షాపై సరఫరా చేస్తుంటాడు. మోహన్ చిల్లర దుకాణాలకు సరుకులు సరఫరా చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఇరువురికి రిక్షాలు లేకపోవడంతో ఇటీవల ఆత్మకూరులో పర్యటించిన ఎమ్మెల్యే ఆర్కేను కలసి రిక్షాలు కావాలని కోరారు. స్పందించిన ఆయన రిక్షాలను తయారు చేయించారు. సోమవారం పార్టీ నాయకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎం.మల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు బి.శివరామిరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



సామాజిక తనిఖీ శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మండల పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీ కార్యక్రమంపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ సత్యనారాయణ మూర్తి హాజరై మాట్లాడుతూ సపోర్టింగ్ ఆఫ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాల్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో చేపడుతున్న నాడు నేడు పాఠశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సామాజిక తనిఖీ తల్లిదండ్రుల ద్వారా నిర్వహించాల్సిన ముఖ్యమైన అంశంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ ప్రశ్నపత్రంలో మొత్తం ఆరు ప్రధాన అంశాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల మౌలిక వనరులు, ఉపాధ్యాయుల ప్రగతి విద్యార్థులు, ప్రగతి సౌకర్యాలు, విద్యార్థుల సెక్యూరిటీ, కమ్యూనిటీ మొబలైజేషన్, కమ్యూనిటీ భాగస్వామ్యం అంశాలు మరియు 42 ఉప అంశాల గురించి నాలుగు లెవల్స్ గురించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. 107 ప్రశ్నలను ఎలా పూర్తిచేయాలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు సీఎంఓ సమగ్ర శిక్ష గుంటూరు, కె.పూర్ణ వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల చేత యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి యాప్‌ని ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలో పేరెంట్స్ కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణ ఇచ్చి సామాజిక తనిఖీలపై అవగాహన కల్పించాలి ఈనెల 29వ తేదీ లోగా సామాజిక తనిఖీ రిపోర్టులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిలో 39 మంది, మంగళగిరి నుంచి 64 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కాగా, జిల్లా రీసోర్స్ పర్సన్ ఎం. ఏడుకొండలు, ఉన్నం ప్రసాద్, డైట్ కళాశాల లెక్చరర్ టి.శ్రీనివాసు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు శిక్షణ

మేడికొండూరు: సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ ఎస్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

సొసైటీపాలక వర్గం ప్రమాణస్వీకారం



పాలకవర్గాన్ని అభినందిస్తున్న నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రాజనారాయణ తదితరులు

మంగళగిరి: వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) పాలకవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. నగరంలోని నిడమర్రు రోడ్డులోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా కాజకు చెందిన ఆర్ల బ్రహ్మయ్య, డైరెక్టర్‌లుగా చినకాకానికి చెందిన సుంకర సుబ్బారావు, నిడమర్రుకు చెందిన కర్రి మరియదాసుతో సొసైటీ కార్యదర్శి రమేష్ నూతన ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నియోజవకర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ సొసైటీ పాలక వర్గం రైతులకు అండగా నిలిచి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలనికోరారు. ఎమ్మెల్యే ఆర్కే ఆశయాన్ని నెరవేర్చేలా పనిచేయాలని సూచించారు. నూతన పాలక వర్గాన్ని అభినందించిన వారిలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, మాజీ చైర్మన్ సుంకర రఘుపతిరావు, నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, ఆర్ల సూర్యబ్రహ్మేశ్వరరావు, ఆర్ల రామయ్య, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్ ఉన్నారు.

దళితుల భూములు దళితులకే ఇవ్వాలని వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములను దళితులకే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని స్పందనలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు దళిత నాయకుడు కారుమంచి రామారావు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మండల పరిధిలో కృష్ణా నది ప్రాంతంలో 1953లో డీసీటీసీ సొసైటీ చిర్రావూరు, పెదవడ్లపూడి, శృంగారపురం తదితర నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న దళిత కుటుంబాలకు ప్రభుత్వం వారు సుమారుగా 250 ఎకరాలు భూమిని ఒక్కొక్కరికి 40 సెంట్లు, ఎకరం చొప్పున కేటాయించారని, అనంతరం కొంతమంది దళారులు దళితులకు డబ్బులు వడ్డీకి ఇచ్చి వారు కట్టలేని విధంగా చేసి ఆ భూములను ఆక్రమించుకుని ఆ భూములకు పాస్ పుస్తకాలు కూడా తీసుకువచ్చి అక్రమంగా భూములను లాక్కున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే దళితుల భూమి సంరక్షించి భూమిపై సర్వే చేసి అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూమిలేని నిరుపేద దళితులకు కేటాయించాలని విన్నవించారు.

పలువురు విద్యార్థులకు ఎన్‌సీసీ అవార్డులు



అవార్డులు పొందిన వారితో కల్నల్ చంద్రశేఖర్

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీ అవార్డులకు తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం షేక్ మౌలాబి తెలిపారు. వీటిని న్యూఢిల్లీకి చెందిన డీజీఎన్‌సీసీ విభాగం వారు ప్రకటించినట్లు చెప్పారు. జూనియర్ విభాగంలో పలపర్తి లక్ష్మీ పద్మావతి బెస్ట్ క్యాడెట్ అవార్డుకు ఎంపికైందన్నారు. వరుసగా మూడు సంవత్సరాల నుంచి తమ పాఠశాలకు ఈ అవార్డు వస్తుందని, ఈ ఏడాదితో హ్యాట్రిక్ సాధించినట్లు అయిందని వివరించారు. అవార్డుతో పాటు రూ.3,500 నగదు ప్రోత్సాహక బహుమతిని లక్ష్మీ పద్మావతికి అందించినట్లు చెప్పారు. అలాగే ఎం.యోచన, పి.లక్ష్మీపద్మావతి,పి.ధర్మతేజ, ఆర్.చింటు నాయక్‌లు సిడబ్ల్యూవోఎస్ స్కాలర్ షిప్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ.ఆరువేల నగదును దీని ద్వారా అందించనున్నట్లు చెప్పారు. వీరందరికీ కల్నల్ ఎస్ఎన్.చంద్రశేఖర్ అవార్డులు అందజేసి నగదును పంపిణీ చేశారు. తెనాలిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నందివెలుగులో రైతు సదస్సు

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగులో బాపట్ల వ్యవసాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినుల ఆధ్వర్యంలో సోమవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. రూరల్ వర్క్స్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా సదస్సు చేపట్టారు.

సవరణ ప్రకటన

[illegible]

ఈమని అశోక్ రెడ్డి, [illegible]
మంగళగిరి పోస్టు, గుంటూరు జిల్లా. సెల్: 9247768630

ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణం

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి

తెనాలిరూరల్: ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణమని, ఎక్కడ పని చేసినా బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించడమే న్యాయమూర్తులు ప్రధాన కర్తవ్యమని 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి అన్నారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో తెనాలి అడ్వకేట్ క్లర్క్స్ అసోసియేషన్ సభ్యులు బదిలీ అయిన జడ్జిలను సోమవారం సత్కరించారు. జడ్జి మాలతి మాట్లాడుతూ న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, ప్రభుదాసు, రాజు, సాగర్, దూండి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, నరసింహారావు, శ్రీనివాసరావు, జాను పాల్గొన్నారు.